సాక్షి
పార్వతీపురం మన్యం
గురువారం । 5 । అక్టోబర్ । 2023



ఓపీ సేవలు సులభతరం

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఓపీ సేవలు సులభతరమయ్యేలా అభా యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. - 8లో



మృత్యు తీగలు

పొలానికి వెళ్లిన విద్యార్థిని విద్యుత్ తీగల రూపంలో మృత్యువు కాటేసింది. తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చింది. - 8లో

కోటదుర్గమ్మకు పూజలు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రీతికరమైన బుధవారం పల్లెల్లో వారాలు చేపడుతున్న భక్తులు గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించి. దుర్గమ్మకు సంప్రదాయ పూజలు జరిపారు. అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద శర్మ నేతృత్వంలో ఉత్సవమూర్తికి విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

యాజమాన్య పద్ధతులతో సాగుబాగు



మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

సీతంపేట: గిరిజన ప్రాంతాల రైతులు సాగు చేసే ఉద్యానవన పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు చేతి కందుతాయని కృషివిజ్ఞాన కేంద్రం రస్తాకుంటుబాయి శాస్త్రవేత్త డాక్టర్ జి.అను తెలిపారు. పశుపోషణలో మెలకువలు పాటించాలని సూచించారు. స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో రెండోరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జీడిమామిడిలో నాణ్యమైన రకాలు, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పీహెచ్‌ఓ గణేష్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో కలిసివచ్చే పసుపు, అల్లం రకాలను తెలియజేశారు. ప్రాజెక్టు వ్యవసాయాధికారి జి.హరికృష్ణ సుస్థిర వ్యవసాయం, ఈ-క్రాపింగ్, ప్రొక్యూర్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. జీవన ఎరువుల వినియోగంపై చర్చించారు. క్షేత్రసందర్శన చేశారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం వ్యవసాయ శాస్త్రవేత్తలు పి.సీతారాం, ఎస్.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'లో వినతుల స్వీకరణ



జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతులు స్వీకరిస్తున్న పీఓ విష్ణుచరణ్, ఆర్డీఓ హేమలత

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. కార్యక్రమానికి పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్, ఆర్డీఓ హేమలత హాజరయ్యారు. వివిధ సమస్యలపై 50 మంది వినతులు అందజేశారు. తురక నాయుడువలస గ్రామానికి చెందిన ఎరుకుల కులస్తులకు ఎస్టీ ధ్రువీకరణ పత్రం అందజేయాలని, రావాడ జలాశయం దిగువన కాజ్‌వే నిర్మించాలని, రాతి క్వారీ నిర్వహణకు అనుమతులు ఇప్పించాలని, గిరిజన గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలు పూర్తిచేయాలని, టి.కె.జమ్ము నుంచి మండల కేంద్రానికి బస్సు సౌకర్యం కల్పించాలని వినతులు అందజేశారు. ఏనుగులు తరలింపు చర్యలు తీసుకోవాలని, రామభద్రపురంలో మంజూరైన క్రీడా పాఠశాలకు భూములిచ్చిన గిరిజన రైతులకు ఉపాధి కల్పించాలని, మరువాడలో అంగన్‌వాడీ భవనం, రామభద్రపురంలో శ్మశాన వాటిక అర్ధాంతరంగా నిలిచిపోయాయని, వాటిని వెంటనే పూర్తిచేయాలని పలువురు విన్నవించారు. పీవీటీజీ గ్రామాలైన పందులవానివలస, లోతువానివలస, చిలకలవానివలస, పనుపువానివలస, పొట్టిదొరవలస, సింగిపురంవలస గ్రామాలకు పక్కా రోడ్డు నిర్మించాలని, పామాయిల్ వ్యర్థాలను వట్టిగెడ్డలో కలుషితంచేస్తున్న పామాయిల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘ నాయకులు ఆరిక చంద్రశేఖర్, ఆరిక చలపతిరావు, సీపీఎం నాయకులు కె.గంగునాయుడు, కె.సీతారాం తదితరులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.వి.సీతారామయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

పసిడితల్లి పండగకు పందిరిరాట



పందిరిరాట ఉత్సవంలో ఆలయ సిబ్బంది, భక్తులు, ప్రజాప్రతినిధులు

విజయనగరం టౌన్: చిన్నారి పసిడితల్లి పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలకు బుధవారం పందిరిరాట మహోత్సవంతో అంకురార్పణ చేశారు. ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి నేతృత్వంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో ఉదయం 9.30 గంటలకు, విజయనగరం రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి ఆవరణలో ఉదయం 11 గంటలకు శాస్త్రోక్తంగా అమ్మవారి పందిరిరాట వేశారు. పూజల్లో సిరిమాను పూజారి వెంకటరావు పాల్గొన్నారు.

నిధులు ఫుల్

- అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదు
- పని పూర్తయిన వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలి
- అధికారులకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశం
- మరో 27వేల మందికి ఇళ్ల మంజూరుకు ప్రతిపాదనలు
- అర్హతే ప్రామాణికంగా సామాజిక పింఛన్ల మంజూరు
- శత శాతం ఈ-క్రాప్ నమోదుతో రైతులకు భరోసా
- ఉమ్మడి జిల్లాలో పలు అభివృద్ధి అంశాలపై సమీక్ష



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం/విజయనగరం రూరల్: ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి పనులేవీ అలస్యం చేయవద్దని, నిధులకు కొరత లేదని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పని పూర్తి అయినా వెంటనే బిల్లులను అప్‌లోడ్ చేసే చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. జెడ్పీ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ నాగలక్ష్మి, పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు, జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పలు అంశాలను సమీక్షించారు. సమావేశంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, ఎమ్మెల్సీ రఘురాజు పలు అంశాలను ప్రస్తావించారు. తొలుత గత సమావేశంలో చర్చించిన అంశాలు, ఆ మేరకు తీసుకున్న చర్యలను జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ వివరించారు. గరుగుబిల్లి, బలిజపేట మండలాలను పార్వతీపురం విద్యుత్ సబ్‌డివిజన్‌లో చేర్చినట్లు తెలిపారు. విజయనగరం మండలంలో మరో పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినట్లు వెల్లడించారు. వలంటీర్లు, ఆర్‌బీకేల్లో కంప్యూటర్ ఆపరేటర్ల వేతనాల సమస్యలను పరిష్కరించామన్నారు. అనంతరం ఇరు జిల్లాల్లో గృహ నిర్మాణం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ పనులు, డీఆర్‌డీఏ, విద్య, వ్యవసాయం, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం తదితర అంశాలపై సమావేశంలో సమీక్ష జరిగింది.

కొత్తగా 27వేల ఇళ్లకు ప్రతిపాదనలు

ఉమ్మడి జిల్లాలో కొత్తగా సుమారు 27వేల ఇళ్లను మంజూరు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. విజయనగరం జిల్లాలో 15,040 ఇళ్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 11,800 ఇళ్లకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని పలువురు ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. దీనిపై జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ అవన్నీ వ్యక్తిగత ఇళ్లు మాత్రమేనని, సొంత స్థలం ఉన్నవారికి వెంటనే మంజూరు చేయడానికి ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో నిర్మాణ పనులు ప్రారంభించని వారి వివరాలను ఆయా నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన తర్వాత తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీపీలు, జెడ్పీటీసీల సూచనలను పరిగణనలోకి తీసుకొని కొత్త ఇళ్ల మంజూరుకు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టును తయారు చేయాలని రెండు జిల్లాల్లోని హౌసింగ్ పీడీలను జెడ్పీ చైర్మన్ సూచించారు.

శతశాతం ఈ-క్రాప్ నమోదు

ఏ ఒక్క రైతూ నష్టపోకుండా శతశాతం ఈ-క్రాప్ నమోదు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ-క్రాప్ నమోదులో తలెత్తుతున్న పలు సమస్యలను ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. భూములతో సంబంధం లేకుండా సాగుచేసిన ప్రతి పంటా ఈ-క్రాప్‌లో నమోదు కావాలని జెడ్పీ చైర్మన్ సూచించారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు చెప్పారు. జీపీఎస్ ఉన్న వాహనాలను మాత్రమే ధాన్యం రవాణాకు వినియోగిస్తామని, గోనె సంచులను మిల్లర్లే సమకూర్చుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మితమవుతున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల పనులు త్వరగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులకు జెడ్పీ చైర్మన్ సూచించారు. వీటిని సత్వరమే పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అదనంగా నిధులను కేటాయించిందని చెప్పారు. ఈ పనుల్లో విత్‌హెల్డ్, క్వాలిటీచెక్ కోసం నిధులను పెండింగ్ పెట్టకూడదని స్పష్టం చేశారు. ఇవే కాకుండా ప్రాధాన్యేతర పనులు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా చేపట్టిన పనులను కూడా సత్వరమే పూర్తి చేయాలన్నారు. నిధులకు ఎక్కడా సమస్య లేదని, పనులు పూర్తి అయిన వెంటనే బిల్లులు మంజూరు అవుతున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం ఎమ్మెల్యేల ద్వారా ప్రతి మండలానికి రూ.60 లక్షలు విడుదల చేసిందని, జెడ్పీటీసీల వద్ద జెడ్పీ నిధులు రూ.15 లక్షలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. వాటిని సకాలంలో వినియోగించి సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జెడ్పీ చైర్మన్ సూచించారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, నెక్కల నాయుడుబాబు సహా వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షల అనంతరం పింఛన్...

అర్హత ఉన్నా ఆధార్ కార్డులో వయసు తక్కువగా నమోదైన వారికి వైద్య పరీక్షల అనంతరం అర్హులని తేలితే పింఛన్ మంజూరు చేసే అవకాశం ఉందని జెడ్పీ చైర్మన్ చెప్పారు. దీనికోసం వారు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓల ద్వారా మెడికల్ బోర్డుకు పంపించి ఆయా దరఖాస్తుదారుల వయసు నిర్ధారణ చేస్తారని చెప్పారు.

గురజాడ స్మారక భవన నిర్వహణకు జెడ్పీ సాయం...

గురజాడ అప్పారావు స్మారక భవన నిర్వహణకు నెలకు రూ.10 వేలు చొప్పున కేటాయిస్తూ తీర్మానం చేస్తున్నామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రకటించగానే జెడ్పీ సర్వసభ్య సమావేశంలో హర్షధ్వానాలు మిన్నంటాయి. జెడ్పీ సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించారు. గురజాడ పేరు చిరస్థాయిగా నిలిచిపోయేందుకు మరిన్ని కార్యక్రమాలను చేపడతామని జెడ్పీ చైర్మన్ ప్రకటించారు. తొలుత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ గురజాడ గొప్పదనాన్ని కొనియాడారు. గురజాడ విరచిత కన్యాశుల్కం ఎప్పటికీ నిత్యనూతనమన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు

16 నుంచి ఈవీఎంల మొదటి దశ తనిఖీలు



ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఈవీఎంల మొదటి దశ తనిఖీలను ఈ నెల 16వ తేదీ నుంచి చేపడతామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. ఓటరు పునశ్చరణ, ఇతర ఎన్నికల సంబంధిత అంశాలపై కలెక్టర్ కార్యాలయంలో బుధవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు బ్యాలెట్ యూనిట్లు 3,250, కంట్రోల్ యూనిట్లు 2,560, వీవీపాట్‌లు 3,170 కేటాయించారని, అందులో ఒక వీవీపాట్ మినహా మిగిలినవి జిల్లాకు చేరాయని చెప్పారు. వీటి మొదటి దశ తనిఖీలను ప్రతి రోజూ ఉదయం 8.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఆ సమయానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని సూచించారు. ఈ నెల 27న సమీకృత ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ జరుగుతుందని వివరించారు. అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 9 వరకు స్వీకరించిన అభ్యంతరాలను డిసెంబర్ 26వ తేదీలోగా పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో కొత్తగా ఏడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుకు ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపించామన్నారు. జిల్లాలో ఇప్పటికే 1024 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్టు వెల్లడించారు. 26 పోలింగ్ కేంద్రాలు లొకేషన్ మార్పుకు, 32 పోలింగ్ కేంద్రాల పేర్లుమార్పుకు కూడా ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు సమర్పించామన్నారు. జిల్లాలో ఏప్రిల్ 15 నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు 18,088 ఓటర్లు కొత్తగా చేరగా, 20,236 ఓట్లు తొలగించామని, 63,965 ఓటర్ల వివరాల్లో మార్పులు చేర్పులుచేసినట్టు వివరించారు. ఫారం- 6 కింద 20,027 దరఖాస్తులు అందగా 473 దరఖాస్తులు తిరస్కరించామన్నారు. సమావేశంలో డీఆర్వో జె.వెంకటరావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ డి.రవికుమార్, వివిధ పార్టీల ప్రతినిధులు పారిశర్ల అప్పారావు, జాగాన భాస్కరరావు, బి.డి.చంద్రమౌళి, తామరకండి వెంకటరమణ, ఆర్.వేణు, సీహెచ్ సంతోష్‌కుమార్, కొత్తకోట పాపారావు, పైల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన ప్రారంభం

విజయనగరం అర్బన్: జిల్లాలోని భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 15 ఐఈఆర్‌పీ (ఇన్‌క్యూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్‌పర్సన్) పోస్టులు కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేస్తున్న సంగతి తెలిసిందే. అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కలెక్టరేట్‌లోని సమగ్ర శిక్ష కార్యాలయంలో బుధవారం ప్రారంభమైంది. ఐఈఆర్‌పీ పోస్టుల్లోని ఎంఆర్ కేటగిరీకి 43 మంది, వీఐ/హెచ్‌ఐ కేటగిరీకి 50 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. తొలిరోజున ఎం.ఆర్.కేటగిరి పోస్టులకు 30 మంది, వీఐ/హెచ్‌ఐ కేటగిరీకి చెందిన 36 మంది దరఖాస్తులు పరిశీలించామని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. తొలిరోజు పరిశీలనకు హాజరుకాని వారు గురువారం హాజరు కావాలని తెలియజేశారు.

త్వరితగతిన జల్‌జీవన్ మిషన్ పనులు

సీతంపేట: జల్‌జీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఐటీడీఏలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గృహనిర్మాణాల పనులు పూర్తి చేయాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఏకలవ్య పాఠశాలల భవన నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ ఈఈ సింహాచలం, డీఈలు కృష్ణకుమార్, ఢిల్లేశ్వరరావు, లోకనాథం, సిమ్మన్న పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సకాలంలో ఆస్పత్రిలో చేర్పించాలని వైద్యసిబ్బందికి కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. కలెక్టర్ చాంబర్‌లో జూన్-ఆగస్టు మధ్య జరిగిన మాతృ, శిశుమరణాలపై బుధవారం సమీక్షించారు. మాతా, శిశుమరణాల నివారణే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. బిడ్డకు పాలిచ్చే విధానం, భంగిమలపై మొదటిసారి గర్భందాల్చిన గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. హైరిస్క్ గర్భిణులను ఆస్పత్రికి తరలించేందుకు 108తో పాటు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఘోష ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ అరుణశుభశ్రీ, మత్తు వైద్యులు డాక్టర్ బాలకృష్ణ, పిడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ సుజాతదేవి, డీఐఓ డాక్టర్ అచ్యుతకుమారి, డీపీహెచ్‌ఎన్‌ఓ మామిడి సత్యవతి పాల్గొన్నారు.

ఊరి చెంతనే వైద్యం



లక్కవరపుకోట మండలం గంగుబూడి గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న సిబ్బంది

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు... వేలాది మంది ప్రజలకు ఆరోగ్య సాంత్వన చేకూర్చుతున్నాయి. పైసా ఖర్చులేకుండా నిపుణులైన వైద్యులు ఊరికి వచ్చి వైద్యపరీక్షలు చేస్తున్నారు. అవసరమైన మందులు అందజేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల నుంచి ఉపశమనం కల్పించేలా వైద్యసేవలు అందిస్తున్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలో గతనెల 30 నుంచి సాగుతున్న వైద్యశిబిరాలు వేలాది మందికి ఆరోగ్యభరోసా కల్పిస్తున్నాయి. కొత్త ఊపిరి పోస్తున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలతో ఆరోగ్యం కుదుటపడుతుండడం, వేలాది రూపాయల విలువచేసే మందులు ఊరిలోనే అందజేయడంపై రోగులు సంతోషపడుతున్నారు. ప్రజారోగ్యానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను ప్రశంసిస్తున్నారు.

- సాక్షిప్రతినిధి, విజయనగరం



పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం గంగాడలో వృద్ధుడి ఆరోగ్యాన్ని పరీక్షిస్తున్న గళావల్లి పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాసరావు

బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు ఇలా..

జిల్లా	మండలాలు	వైద్యశిబిరాలు	ఓపీ	వైద్య పరీక్షలు	రిఫరల్ కేసులు
విజయనగరం	27	23	9,495	7,552	122
పార్వతీపురం మన్యం	15	13	5,487	2,457	119

పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ

- ప్రజారోగ్యానికి భద్రత
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు
- పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన
- నిర్ణీత సమయంలో తాగునీటి ట్యాంకుల క్లీనింగ్
- దోమల నివారణకు ఫాగింగ్
- మలేరియా, డెంగీ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు



జిల్లాలో క్లీన్‌అండ్ గ్రీన్ కార్యక్రమంలో చెత్తసేకరణ

పార్వతీపురం టౌన్:

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజారోగ్యంపై జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వర్షాలు.. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పల్లెలు, పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించారు. దోమల నివారణ చర్యలను వేగవంతం చేశారు. సురక్షిత మంచినీటిని సరఫరా చేసేందుకు తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేస్తున్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పారిశుద్ధ్య లోపం, కలుషిత నీటి కారణంగా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వస్తాయని, జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మురుగు కాలువలను ఎప్పటి కప్పుడు శుభ్రం చేయిస్తున్నారు. గృహ పరిసర ప్రాంతాలు, రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ పౌడర్ చల్లుతూ రోగాలు ప్రబల కుండా ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారు. జిల్లాలోని 2,148 రక్షిత మంచినీటి ట్యాంకులను ప్రతీ 15 రోజులకు ఒకసారి క్లోరినేషన్ చేస్తున్నారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో	
రెవెన్యూ గ్రామాలు	: 955
తాగునీటి ట్యాంకులు	: 2,148
ఫాగింగ్‌మిషన్లు	: 312

మలేరియా నిర్మూలన చర్యలు

జిల్లాలో మలేరియా కారక దోమల నివారణకు 350 సచివాలయాలకు ఫాగింగ్ మిషన్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. దోమల్ని లార్వా దశలోనే నివారించే అబేట్, పెద్ద దోమలను నిర్మూలించే సైఫునోథ్రిన్ వంటి మందులను సరఫరా చేసింది.



హోం కంపోస్టు కేంద్రలో కంపోస్టును తయారు చేస్తున్న మున్సిపల్ అధికారులు

పారిశుద్ధ్యంపై అవగాహన



వర్షాలతో వ్యాధులు ప్రబల కుండా తగు చర్యలు చేపట్టాం. ట్యాంకుల నుంచి సురక్షిత నీటిని సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశాం. గృహ పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా, లార్వా ఉత్పత్తి కాకుండా తగిన మందులను పిచికారీ చేయడంతో పాటు పారిశుద్ధ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండేలా ఆదేశాలు జారీ చేశాం. పరిశుభ్రత చర్యలు చేపట్టాలని, వాటర్ ట్యాంకులను నిబంధనల మేరకు శుభ్రం చేయాలని ఆదేశాలు జారీ చేయడంతోపాటు పర్యవేక్షిస్తున్నాం. ప్రతి పంచాయతీకి ఫాగింగ్ యంత్రాలను పంపిణీ చేశాం. సచివాలయ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రజారోగ్యానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు చేపట్టాం.

- బలివాడ సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి, పార్వతీపురం మన్యం

క్లుప్తంగా

సారాతో ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న సారాతో రూరల్ పోలీసు సిబ్బంది

పార్వతీపురం టౌన్: సారాతో ఇద్దరిని అరెస్టు చేసినట్టు పార్వతీపురం రూరల్ ఎస్ఐ సింహాచలం బుధవారం తెలిపారు. మండలంలోని ఆర్కే బట్టివలస గ్రామ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశా రాష్ట్రం నుంచి పార్వతీపురం ప్రాంతానికి సారా రవాణా చేస్తున్న సిరిపురపు అఖిల్, బంగారు కృష్ణలను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీరి నుంచి 320 లీటర్ల సారా, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామన్నారు. రూరల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లతో పట్టుబడిన వ్యక్తితో ఎస్ఐ రాజేష్

గరుగుబిల్లి: మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపిన వివరాలు.. మండలంలోని బురద వెంకటాపురానికి చెందిన కేతిరెడ్డి తిరుపతినాయుడు వద్ద ఉన్న 26 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసును నమోదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరు పరచగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మృతదేహం గుర్తింపు



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం బెలగాం రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు బుధవారం గుర్తించారు. ప్రమాదవశాత్తు జారిపడి మరణించి ఉండవచ్చని ప్రాథమిక విచారణలో తెలిపారు. మృతునికి 60 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, శరీరంపై నలుపు రంగు నిక్కరు, తెలుపు రంగుపై నీలం రంగు గడుల చొక్కా ధరించాడు. తెలుపు రంగు గెడ్డం ఆనవాళ్లుగా గుర్తించారు. ఎస్ఐ రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏ మృతి



మృతి చెందిన దమరసింగి రాము

గుర్ల: మండల కేంద్రంలోని బుధవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గరివిడి మండలంలోని గెడ్డపువలస గ్రామానికి చెందిన దమరసింగి రాము(58) మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాము గరివిడి నుంచి విజయనగరం నడుచుకొని వెళ్తుండగా గుర్ల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడు గరివిడి మండలం గెడ్డపువలస వీఆర్ఏగా పని చేస్తున్నాడు. గుర్తు తెలియని వాహనం గురించి విచారణ చేపడుతున్నామని ఎస్ఐ హరిబాబు నాయుడు తెలిపారు. కేసు నమోదు చేసారు.

ట్రాక్టర్ ప్రమాదంలో కూలి మృతి



మృతి చెందిన రమణ

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస ఇటుకల బట్టి వద్ద మంగళవారం రాత్రి జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన వల్లింకల రమణ(40) మరణించాడు. ఎస్ఐ ఫకృద్దీన్ బుధవారం తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వల్లింకల రాము ఇటుక బట్టి వద్దకు కూలి పని కోసం మంగళవారం వెళ్లాడు. అక్కడ ఎత్తుగా ఉండే ప్రాంతంపైకి అదే గ్రామానికి చెందిన డ్రైవర్ బుడ్డిపు శంకరరావు ట్రాక్టర్ ఎక్కిస్తుండగా, ట్రాక్టర్‌ను వెనుక నుంచి తోస్తున్న రమణ మీదకు ట్రాక్టర్ అదుపు తప్పి వెనక్కి వచ్చి తగిలింది. ఈ ప్రమాదంలో రమణ మరణించాడు. కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని ఎస్ఐ అన్నారు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

ఓపీ సేవలు సులభతరం

- అభా యాప్‌ను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం
- రోజుకు ఓపీకి వచ్చే రోగులు 1000 నుంచి 1500 మంది
- అందులో అభా యాప్ ద్వారా ఓపీ చీటీలు పొందుతున్న వారు 600 మంది
- నిరీక్షణకు తెర



ఓపీ కోసం ఉన్న రోగులు

విజయనగరం ఫోర్ట్: ఎవరైనా వ్యక్తికి ఏదైనా జబ్బు చేస్తే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలంటే ముందుగా ఔట్ పేషెంట్ (ఓపీ) విభాగంలో ఓపీ చీటి తీసుకోవాలి. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో రోగులు తక్కువగా ఉంటారు కాబట్టి ఓపీ చీటీ తీసుకోవడం తక్కువ సమయంలో అయిపోతుంది. అదే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అయితే అధిక సంఖ్యలో రోగులు వస్తారు కాబట్టి ఈ చీటీ కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి. దీన్ని గుర్తించిన ప్రభుత్వం అభా యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. యాప్ ద్వారా సులభంగా ఓపీ చీటీని పొందవచ్చు. క్యూలో ఎక్కువ సమయం నిరీక్షించాల్సిన అవసరం ఉండదు.

అభా యాప్ డౌన్‌లోడు చేసుకోవాలి

అభా యాప్‌ను స్మార్ట్ ఫోన్ ద్వారా ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌లో ఫోన్ నంబరు ఎంటర్ చేయగానే ఓటీపీ వస్తుంది. తర్వాత ఓపీ విభాగంలో ఏర్పాటు చేసిన స్కాన్ చేస్తే షేర్ చేయండి అని వస్తుంది. షేర్ చేస్తే వెంటనే టోకెన్ నంబరు వస్తుంది. టోకెన్ నంబరు ఓపీ విభాగంలో చెబితే వెంటనే ఓపీ చీటీ ఇస్తారు.

రోజుకు 1000 నుంచి 1500 మంది రోగులు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వివిధ వ్యాధులతో బాధపడే వారు అధిక సంఖ్యలో ప్రతి రోజు వస్తారు. ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, చర్మ, ఈఎన్‌టీ, డెంటల్, కంటి, ఎన్‌సీడీ, పలమనాలజీ, ఆర్థో, ఓపీ విభాగాలు ఉన్నాయి. ఈ విభాగాల్లో చికిత్స కోసం రోజుకు 1000 నుంచి 1500 మంది రోగులు వస్తారు. వీరిలో 500 నుంచి 600 మంది వరకు అభా యాప్ ద్వారా ఓపీ పొందుతున్నారు. అభా యాప్ రాక ముందు ఓపీ చీటీలు కోసం రోగులు గంటల తరబడి లైన్‌లో ఉండేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి తప్పింది.

అభా యాప్‌పై అవగాహన

ఓపీ చీటీ కోసం వచ్చే వారికి వైద్య సిబ్బంది అభా యాప్‌పై అవగాహన కల్పిస్తున్నారు. స్మార్ట్ ఫోన్ ఉండి యాప్ డౌన్‌లోడ్ చేసుకోలేని వారికి వైద్య సిబ్బంది యాప్ ఏ విధంగా డౌన్‌లోడ్ చేసుకోవాలి, చీటీ ఏవిధంగా పొందాలి అనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు.



అభా యాప్ గురించి వివరిస్తున్న వైద్య సిబ్బంది

మంచి స్పందన

అభా యాప్‌ను ఎక్కువ మంది రోగులు వినియోగించుకుంటున్నారు. యాప్ గురించి తెలియని వారికి మా సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. రోజుకు 600 మంది వరకు అభా యాప్ ద్వారా ఓపీ చీటీలు పొందుతున్నారు. రెండోసారి ఓపీ పొందాలనుకునే వారు నేరుగా స్కాన్ చేసి ఓపీ పొందవచ్చు.

– డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, సూపరింటెండెంట్

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం ఫోర్ట్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. స్థానిక ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన కాష్వి ఆస్పత్రిని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవా దృక్పథంతో సేవలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, టీడీపీ నాయకులు అశోక్‌గజపతిరాజు, కర్రోతు బంగారురాజు, ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మోపాడ, డాక్టర్ చంద్రకళ కర్రోతు తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

6న ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా

- జిల్లా ఉపాధి అధికారిని అరుణ

విజయనగరం అర్బన్: పట్టణంలోని మహిళా ప్రాంగణం దరిలోని ఐటీఐలో ఈ నెల 6న జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారిణి డి.అరుణ తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఆర్గనైజేన్, గాయత్రి ఆస్పత్రి, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్ కంపెనీల్లో వివిధ కేడర్లలో 106 ఉద్యోగాల నియామక ప్రక్రియ ఆయా సంస్థల ప్రతినిధులు చేపడతారని తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఆర్గనైజేషన్‌లో బిజినెస్ డవలప్మెంట్ మేనేజర్ 10 (పర్మినెంట్) పోస్టులకు రూ.22 వేల నుంచి రూ.35 వేల వేతనం ఉంటుందని ఈ పోస్టులకు 25 నుంచి 35 సంవత్సరాలలోపు వయసుతో ఏదైనా డిగ్రీ విద్యార్హత ఉంటే సరిపోతుందని పేర్కొన్నారు. ఆ ఫైనాన్స్ కన్సల్టెంట్ 50 (టెంపరరీ) పోస్టులకు రూ.15 నుంచి రూ.40 వేల వరకు గౌరవ వేతనం ఉంటుందని, ఈ పోస్టులకు 60 సంవత్సరాలలోపు వయసుతో పదో తరగతి విద్యార్హత ఉండాలని తెలిపారు. గాయత్రి ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సు 11 పోస్టులకు రూ.8,500 నుంచి రూ.10 వేల వేతనం ఉంటుందని ఈ పోస్టులకు 18 నుంచి 27 సంవత్సరాల వయసులోపు ఉన్న ఏఎన్ఎం/జీఎన్ఎం/బీఎస్సీ నర్సింగ్ విద్యార్హత ఉన్న స్త్రీలు మాత్రమే అర్హులను తెలిపారు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్‌లో బ్యాంక్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ 35 పోస్టులకు రూ.14,500 వేతనం ఉంటుందని, ఈ పోస్టులకు 35 సంవత్సరాలలోపు వయసున్న ఇంటర్/ఏదైనా డిగ్రీ విద్యార్హత అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 'ఎన్‌సీఎస్.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లోని జాబ్ సీకర్ లాగిన్ చేసుకోవాలని తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఎంపిక ప్రాంగణానికి తమ బయోడేటాను, రెండు పాస్‌ఫోటోలతో నేరుగా హాజరు కావాలని సూచించారు.

జెడ్పీ చైర్మన్‌కు అభినందనలు



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును అభినందిస్తున్న శిష్టకరణ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును ఏపీ శిష్ట కరణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కంఠిమహంతి అనూష పట్నాయక్ బుధవారం ఆయన చాంబర్‌లో కలిసి అభినందనలు తెలిపారు.

జెడ్పీ చైర్మన్‌గా రెండేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ కె.చంద్రమౌళి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆరికతోట చంద్రమౌళి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జయితి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు డొంకాడ అనీల్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వూటపల్లి గోవింద, సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మృత్యు తీగలు

- యువకుడిని బలిగొన్న విద్యుత్ తీగలు
- చెట్టు కొమ్మలు కోస్తూ విద్యుత్ షాక్‌కు గురి



కుమార్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, (ఇన్‌సెట్‌లో) అలుబిల్లి కుమార్(ఫైల్)

వీరఘట్టం: పొలంలో కలగొప్పులు విత్తనాలు చల్లి అర గంటలో వచ్చేస్తానని చెప్పిన కొడుకు అంతలోనే మృత్యు ఒడికి చేరుకున్నాడు. విషయం తెలిసి తల్లిదండ్రులు విషాదంలో మునిగిపోయారు. గుండెలవిసేలా రోదిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వీరఘట్టం సాయినగర్ కాలనీకి చెందిన అలుబిల్లి మజ్జీశ్వరరావు, సూరీడమ్మ దంపతుల రెండో కుమారుడు అలుబిల్లి కుమార్(20) పాలకొండలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు వెళ్లే ముందు తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సాయం చేస్తూ చదువు సాగిస్తూ ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్నాడు. ఖరీఫ్ సీజన్‌లో మంగళవారం తరువాత బుధవారం కలగొప్పులు జరపడం ఇక్కడ ఆనవాయితీ. ఇంటిలో వండిన వేడి అన్నం తమ పొలంలో చల్లుతారు. ఇందుకు ఆకులు కావాల్సి ఉండడంతో తమ పొలానికి సమీపంలో ఉన్న ఓ టేకు చెట్టును కుమార్ ఎక్కుతూ ఓ కొమ్మను కొడవలితో కొట్టాడు. పక్కనే ఉన్న పాలకొండ – వీరఘట్టం 33/11 కేవీ విద్యుత్ లైన్‌పై కొమ్మ పడింది. దీన్ని గమనించని కుమార్ తాను నరికిన టేకు కొమ్మను తన ఎడమ చేతితో పట్టుకుని లాగేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఆ తీగలకు తగిలి షాక్‌కు గురై మృతి చెందాడు. ఎస్ఐ ఎంవీ రమణ కేసు నమోదు చేశారు. ట్రాన్స్‌కో ఏఈ డి.బాలాజీ సంఘటన స్థలానికి వచ్చి వివరాలు నమోదు చేశారు. కుమార్ మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తరువాత కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అంతలోనే...ఏమైంది!

- అప్పటి వరకు స్నేహితులతో మాట్లాడి..
- ఢిల్లీలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య
- విమానంలో చీపురుపల్లికి మృతదేహం
- విషాదంలో కుటుంబ సభ్యులు

చీపురుపల్లి: 'ఏం కష్టం వచ్చిందో ఏమో.. కనీసం ఎవరితో చెప్పుకోలేదు.. అటు స్నేహితులకుగాని ఇటు కుటుంబ సభ్యులకుగానీ ఎవరికీ తెలియదు... అర్ధరాత్రి వరకు స్నేహితులతో ఫోన్‌లో మాట్లాడాడు. అంతలోనే ఏమైందో తెలియదుగానీ లోకాన్ని విడిచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నాడు.. తన గదిలో ఉరి వేసుకుని సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు.' అధికారులు ద్వారా విషయం తెలుసుకున్న భార్య, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పట్టణంలోని రుంకానవీధికి చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ దాసరి నాగేశ్వరరావు ఢిల్లీలో ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన స్థానికంగా కలచివేసింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, బంధువులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు నాగేశ్వరరావు ఢిల్లీలో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి ఢిల్లీలోని తన క్వార్టర్స్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 2017లో సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన నాగేశ్వరరావుకు రేణుకతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. మూడేళ్ల పాప ఉండగా, భార్య ప్రస్తుతం గర్భవతిగా ఉన్నారు. నెల రోజుల సెలవు కోసం ఇటీవల కుటుంబంతో చీపురుపల్లి వచ్చాడు. సెలవులు పూర్తవ్వడంతో వారం క్రితమే నాగేశ్వరరావు భార్య, పాపను చీపురుపల్లిలోనే ఉంచి విధులకు ఢిల్లీ వెళ్లాడు. త్వరలో పాప పుట్టినరోజు ఉండడంతో భార్య, కుమార్తెను చీపురుపల్లిలో ఉంచి, ఆ సమయానికి తిరిగి రావాలనుకునే విధులకు వెళ్లాడు. కానీ ఏం జరిగిందో తెలియదుగానీ ఆత్మహత్య నిర్ణయం తీసుకున్నాడు. సోమవారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడగా మంగళవారం ఉదయం విధుల్లోకి రాకపోవడంతో అక్కడి అధికారులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో మృతుడు అన్నయ్య మన్మథరావు, స్థానిక ఎంపీటీసీ ముల్లు పైడిరాజు ఢిల్లీ వెళ్లారు. అక్కడ నుంచి మృతదేహాన్ని విమానంలో చీపురుపల్లి తీసుకొస్తున్నారు. గురువారం చీపురుపల్లిలో కుటుంబ సభ్యుల సమక్షంలో అంత్యక్రియలు జరగనున్నాయని ముల్లు పైడిరాజు తెలిపారు.



ఆత్మహత్యకు పాల్పడిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ దాసరి నాగేశ్వరరావు, (ఇన్‌సెట్‌లో) దాసరి నాగేశ్వరరావు(ఫైల్)

తప్పుడు దరఖాస్తులపై అప్రమత్తంగా ఉండాలి

- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి, చిత్రంలో డీఆర్ఓ అనిత

విజయనగరం అర్బన్: ఓటు నమోదు, తొలగింపు ప్రక్రియలో భాగంగా కొంతమంది తప్పుడు దరఖాస్తులు సమర్పించే అవకాశం ఉందని అలాంటి వాటిపై అధికారులు, కింది స్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ హెచ్చరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె పలు అంశాలపై సమీక్షించారు. రాజకీయ లేదా వ్యక్తిగత కారణాలతో కొంతమంది ఉద్దేశపూర్వకంగా వేరే వ్యక్తుల ఓట్లను తొలగించాలని దరఖాస్తులు సమర్పిస్తున్న సంఘటనలు ఇటీవల ఒక జిల్లాలో చోటు చేసుకున్నాయని గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఇలాంటివి విజయనగరం జిల్లాలో చోటు చేసుకోకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫారం–7 దరఖాస్తులను ఒకటికి రెండుసార్లు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించినట్లు తెలితే కఠినమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి వచ్చిన సంబంధిత లేఖ సారాంశాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అధికారులకు వివరించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించి కచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పనలో అధికారులు భాగస్వామ్యం కావాలని చెప్పారు. ఈ ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీల నుంచి సహకారం అవసరమని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనిత, విజయనగరం ఆర్డీఓ ఎం.సూర్యకళ, ప్రత్యేక ఉప కలెక్టర్లు వెంకటేశ్వరావు, సుదర్శన దొర, పద్మలత, నూకరాజు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

చేపలు, రొయ్యల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

- నాక్సా ఉత్తరాంధ్ర రాష్ట్ర కో ఆర్డినేటర్ మురళి



మాట్లాడుతున్న నాక్సా ఉత్తరాంధ్ర రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్.మురళి

తెర్లాం: మత్స్యకారులంతా చేపలు, రొయ్యల సాగు(పెంపకం)లో మంచి యాజమాన్య పద్ధతులను పాటించాలని నాక్సా (నేషనల్ సెంటర్ ఫర్ సస్టైన్‌బుల్ ఆక్వాకల్చర్) ఉత్తరాంధ్ర రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.మురళి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నాక్సా శ్రీకాకుళం జిల్లా ఫీల్డ్ మేనేజర్ పి.రాము ఆధ్వర్యంలో 'మంచి యాజమాన్య పద్ధతులు, విభిన్న జాతుల పెంపకం'పై మత్స్యకారులకు ఇవ్వనున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని తెర్లాం సర్పంచ్ బోనెల రూప జ్యోతి ప్రజ్వలన చేసి బుధవారం ప్రారంభించారు. శిక్షణా తరగతులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన నాక్సా ఉత్తరాంధ్ర రాష్ట్ర కోఆర్డినేటర్ మాట్లాడుతూ మత్స్యకారులంతా మేలైన, విభిన్న జాతులకు చెందిన చేపలు, రొయ్యలు సాగు చేయడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. మోప్డా, మినిస్ట్రీ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా మత్స్యకారుల సంఘాలను ఏర్పాటు చేసి, వారితో చేపలు, రొయ్యల పెంపకానికి అవసరమైన చర్యలు చేపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్య శాఖ ద్వారా ఆక్వా రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తోందని ఆయన చెప్పారు. నాక్సా శ్రీకాకుళం జిల్లా ఫీల్డ్ మేనేజర్ పి.రాము మాట్లాడుతూ ఎస్టీ కులాలకు సంబంధించిన మత్స్యకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తెర్లాం సర్పంచ్ బోనెల రూప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాక్సా ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణా తరగతులను మత్స్యకారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బొబ్బిలి మత్స్యశాఖ అధికారి సీహెచ్ సంతోషి, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు, సభ్యులు వెంకటరమణ, సీతయ్య, సచివాలయ ఫిషరీస్ అసిస్టెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా జట్లు సిద్ధం



కర్నూలులో జరగబోయే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా జట్లు

- ఈ నెల 29 నుంచి కర్నూలులో రాష్ట్ర స్థాయి పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్ – 19 బాల, బాలికల హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు బుధవారం పూర్తయ్యాయి. నగరంలోని రాజీవ్ క్రీడా మైదానం ప్రాంగణంలో జిల్లా అండర్ – 19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి 19 సంవత్సరాల్లోపు వయస్సు గల ఇంటర్మీడియెట్ విద్యనభ్యసిస్తున్న 400మంది క్రీడాకారులు ఎంపిక పోటీలకు హాజరు కాగా... అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 16 మంది బాలురును, 16 మంది బాలికలను తుది జట్టులోకి ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 29 నుంచి 31వ తేదీ వరకు కర్నూలు జిల్లాలో జరగబోయే అంతర్ జిల్లాల బాల, బాలికల హ్యాండ్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపిక పోటీలను జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మల్లిబాబు, స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

6, 7 తేదీల్లో ఖోఖో, కబడ్డీ జట్ల ఎంపికలు

అండర్ – 19 స్కూల్ గేమ్స్ ఖోఖో, కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 6, 7 తేదీల్లో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం ప్రకటించారు. ఆయా రోజుల్లో 10 గంటలకు జిల్లా కేంద్రంలో గల రాజీవ్ క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో 2005 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు పాల్గొనేందుకు అర్హులని, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



చిన్నారావు మృతదేహం

రామభద్రపురం: మండల కేంద్రంలోని ఓ వ్యక్తి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక శ్రీరాంనగర్ కాలనీకి చెందిన ఏనుగుతల చిన్నారావు(48) కుమారుడు గత కొన్ని నెలల క్రితం చనిపోయాడు. దాంతో ఆ బాధను తట్టుకోలేక చిన్నారావు మద్యానికి బానిసయ్యాడు. అప్పులు కూడా చేశాడు. భార్యతో రోజూ గొడవలు జరిగేవి. దీంతో ఈ నెల 2వ తేదీన పురుగుల మందు సేవించడంతో కుటుంబ సభ్యులు ప్రథమ చికిత్స నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.